


# చెరపకురా చెడేవు

కోలపల్లి ఈశ్వర్

**బ**జారులో కూరగాయలు కొనుక్కుని ఇంటికి తిరిగి వస్తున్న రమణయ్యకి, దారిలో భూషణం ఎదురుపడ్డాడు. వాళ్ళిద్దరూ స్నేహితులు.

ఉభయులూ కుశల ప్రశ్నలు వేసుకున్నాక, భూషణం రమణయ్యతో "మీ వీధిలో అద్దెకు ఒక ఇల్లు దొరుకుతుందా రమణయ్యా?" అని అడిగాడు.

"ఎవరికోసం?" అనడిగాడు రమణయ్య.

"కైలాసం అని నాకో మిత్రుడున్నాడులే. అతను తన కుటుంబంతోసహా వుండడానికి ఒక మూడు గదుల ఇల్లు కావాలి. ఇక్కడ ఖాళీ ఇళ్ళు దొరకడం కష్టంగా వుంది. కానీ అతనికిప్పుడు ఇల్లు అత్యవసరం. ఎవరైనా ఒక ఇల్లు చూపిస్తే మూడు వేల రూపాయలు బహుమతిగా కూడా ఇస్తానన్నాడు" అన్నాడు భూషణం.

రమణయ్య ఆలోచనలో పడ్డాడు. మూడు వేల రూపాయలు వూరకే వస్తున్నాయి. ఎలాగైనా ఈ అవకాశం కొట్టేయాలి అనుకున్న రమణయ్య వెంటనే మనసులో ఒక పథకం వేసుకున్నాడు.

"ఇల్లు నేను ఇప్పించగలను. కానీ ఒక వారం, పది రోజులు నాకు గడువివ్వాలి" అంటూ తన మనసులోని పథకాన్ని అతని చెవిలో వేశాడు రమణయ్య. భూషణం కూడా సరేనని తలూపి వెళ్ళిపోయాడు.

భూషణం పక్కింట్లో ఈ మధ్యే ఎవరో వయసు పైబడిన దంపతులు అద్దెకి దిగారు. ఆ ఇంట్లో వారితోపాటు వారి కూతురు, ఆమె కొడుకూ తప్ప మరెవరూ వుండరు. వాళ్ళను ఆ ఇంట్లో నుండి ఎలాగైనా వెళ్ళిపోయేలా చేసి, ఆ ఇంటిని భూషణం మిత్రునికి ఇప్పించి మూడు వేలూ తీసేసుకోవాలని రమణయ్య పథకం.

ఆ వృద్ధ దంపతులుంటున్న ఇంటి యజమాని పక్క గ్రామంలో వుంటాడు. కాబట్టి రమణయ్య తన పథకాన్ని యథేచ్ఛగా అమలు జరుపుకోవడానికి వీలుందనే ధైర్యంతో ఆ రోజు రాత్రే తను అనుకున్నది చేయాలని నిర్ణయించుకున్నాడు.

అర్ధరాత్రివేళ రమణయ్య చిన్నగా మేడమీదికి వెళ్ళి చేతిలో వున్న రాళ్ళు కొన్ని ఆ పక్కింటిపై వుండుండి విసరసాగాడు. లోపల నిదురిస్తున్న వాళ్ళు వులిక్కి పడి లేచి బయటకు వచ్చి చూస్తే, వారికి రమణయ్య కనిపించకుండా దాక్కున్నాడు. వాళ్ళు భయకంపితులై లోనికి వెళ్ళి తలుపులు మూసుకున్నారు.

మరునాడు రాత్రి కూడా అదే విధంగా చేశాడు రమణయ్య. అంతే కాకుండా పెరట్లో గోడ పక్కన దాక్కుని కుక్క ఏడుస్తున్నట్టుగా, నక్క ఊల వేస్తున్నట్టుగా చిత్రవిచిత్ర ధ్వనులను చేశాడు. ఆ ఇంట్లోవాళ్ళు వూపిరి బిగపట్టుకుని భయంతో తెల్లవార్లూ జాగారం చేశారు. ఆ తరువాత మరో రెండు రోజులు కూడా ఇదే తంతు జరగడంతో, ఆ ఇంటివాళ్ళు మరునాడు రమణయ్యని కలిసి, రోజూ రాత్రి జరుగుతున్నది చెప్పి, ఎందుకలా జరుగుతున్నదో తెలియడం లేదని వాపోయారు.

ఏమీ ఎరుగనివాడిలా రమణయ్య వారితో "ఇలాంటివన్నీ దెయ్యాలు చేసే పనులండీ. గతంలో కూడా అర్ధరాత్రివేళ ఆ ఇంటి నుండి అలాంటి శబ్దాలే వినిపించేవి. ఆ కారణంగానే ఇదివరకు ఆ ఇంట్లో వున్నవాళ్ళు ఆ ఇల్లు ఖాళీచేసి వుంటారని నా అనుమానం" అన్నాడు.

దాంతో హడలిపోయిన ఇంటివాళ్ళు మరునాడే పెట్టే బేడా సర్దుకొని ఎక్కడికో వెళ్ళిపోయారు. రమణయ్య తన పథకం పారినందుకు ఎంతో ఆనందపడిపోయాడు. వెంటనే భూషణాన్ని కలిసి జరిగిందంతా వివరించాడు. భూషణం కూడా సంతోషపడి వెంటనే లోనికెళ్ళి రెండు వేల రూపాయలు తెచ్చి రమణయ్యకిచ్చాడు. మిగతా వేయి తన వాటాగా తీసుకుంటున్నానని చెప్పాడు. దొరికింది చాలనుకుని సంబరపడ్డాడు రమణయ్య.

మరో వారంలోనే భూషణం మిగిలిన కార్యక్రమమంతా పూర్తి చేశాడు. ఆ ఇంటి

యజమానికి ఆ ఇంట్లో వున్న వాళ్ళు ఎందుకు ఖాళీచేసి వెళ్ళిపోయారో తెలియదు. కానీ భూషణం మిత్రుడికి ఇల్లు అద్దెకివ్వడానికి ఒప్పుకున్నాడు.

ఇప్పుడు ఆ ఇంట్లో భూషణం మిత్రుడు కైలాసం కుటుంబం వచ్చి దిగింది. అయితే అప్పటి నుండే రమణయ్యకు అనుకోని కష్టాలు మొదలయ్యాయి. కొత్తగా వచ్చినవారి ఇంట్లో అత్తా కోడళ్ళు మహా గయ్యాళి ఘటాలు.

వారు రోజంతా పోట్లాడుకుంటూనే వుంటారు. వారి అరుపులతో రమణయ్యకు పిచ్చెక్కిపోసాగింది.

"ఏమిటమ్మా మీ గొడవ? పక్కింటోవాళ్ళని మనశ్శాంతిగా బ్రతకనీయరా?" అని అడిగితే "చాల్లేవయ్యా చెప్పొచ్చావ్ మా ఇంట్లో మేమేం చేసుకుంటే నీకేం? పెళ్ళీ పెటాకులూ లేని వాడివి. నీకేం తెలుస్తాయి సంసారంలోని బాధలు?" అంటూ అతనిపై యుద్ధానికి దిగారు వాళ్ళు.

వాళ్ళ జోలికి పోతే పరువు పోతుందని భయపడి నోరు మూసుకున్నాడు రమణయ్య.

ఆ ఇంట్లోని పిల్లలు కూడా మహా పెంకి ఘటాలు. అల్లరి చేయడంలో వాళ్ళు కోతుల్ని మించినవాళ్ళు. ఎప్పుడూ కేకలు పెడుతూ, ఎగురుతూ, దుముకుతూ, కొట్టుకుంటూ ఆ ఇంట్లోంచి ఈ ఇంట్లోకి, ఈ ఇంట్లోంచి ఆ ఇంట్లోకి పరుగులు తీస్తూ వుండేవాళ్ళు. చేతికందిన రాళ్ళనీ, అరటి తొక్కల్నీ, మొక్కజొన్న కండెల్నీ రమణయ్య ఇంటిపైకి విసిరేస్తూ నానా గందరగోళం సృష్టించసాగారు. కైలాసానికి ఈ విషయాలు చెబితే పట్టించుకునేవాడే కాదు.

వీళ్ళందరి బాధతోనూ విసిగి వేసారిపోయిన రమణయ్య, ఒకరోజు భూషణాన్ని కలిసి జరిగిందంతా చెప్పి గొల్లుమన్నాడు.

భూషణం నవ్వి "డబ్బు తీసుకున్నావుగా, అనుభవించవలసిందే" అని అన్నాడు.

వెంటనే రమణయ్య "నీ డబ్బు నీకు తిరిగి ఇచ్చేస్తాను. తక్షణం వాళ్ళని ఆ ఇల్లు ఖాళీ చేయించు" అన్నాడు.

ఆ మాట విన్న భూషణం కోపంతో మండిపడ్డాడు.

"అంతా నీ ఇష్టమే అనుకున్నావా? నేను నా మిత్రునికి మాట ఇచ్చాను. నేనతనికి ద్రోహం చేయలేను" అన్నాడు.

రమణయ్యకు కోపం వచ్చింది. "ఏమిటయ్యా ద్రోహం? నేను ఆ ఇంటి యజమానిని కలిసి ఈ గొడవంతా వివరించి, వాళ్ళని ఇల్లు ఖాళీ చేయిస్తాను ఏమనుకున్నావో" అన్నాడు.

భూషణం రమణయ్య భుజం మీద చేయి వేసి తీక్షణంగా అతని కళ్ళల్లోకి చూస్తూ "అలా చేశావనుకో నేను అతని వద్దకు వెళ్ళి నువ్వాడిన నాటకమంతా బట్టబయలు చేస్తాను. నాకేమీ నష్టం లేదు. ముందు నీ పరువే పోతుంది. తన ఇంటిని దెయ్యాల కొంపగా చిత్రించి తన ప్రతిష్ట మంటగలిపినందుకు ఆయన నీ కాళ్ళూ చేతులూ విరగ్గొడతాడు. ఆ తరువాత నువ్వెంత మొత్తుకున్నా ఫలితం ఉండదు" అన్నాడు.

రమణయ్యకి భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టి బిగుసుకుపోయి నిలబడ్డాడు. ఇంకేం చేసినా ఫలితం లేదని అతనికి తెలిసిపోయింది.

"చిన్న స్వార్థం కారణంగా దుర్బుద్ధితో నేను అమాయకులకు హాని తలపెట్టాను. లేనిపోని భయాలని సృష్టించి వారు ఇల్లు వదిలివెళ్ళేలా చేశాను. గాలిలో దెయ్యాలను పుట్టించినందుకు ఇప్పుడు నిజంగానే దెయ్యాల్లాంటివారి బారిన పడ్డాను. నా పాపానికి తగిన శిక్షే పడింది. అనుభవించక తప్పదు" అనుకుంటూ అక్కణ్ణుంచి దిగులుగా కదిలాడు రమణయ్య. ←

---

## మీకు తెలుసా?

### మేలు చేసిన క్రికెట్ బాట్


**'ల**గాన్' సినిమాలో అమీర్‌ఖాన్ ఉపయోగించిన క్రికెట్ బాట్ లాహోర్‌లో వేలం వెయ్యగా 60 లక్షలకు ఒక అభిమాని కొన్నాడు. ఆ సొమ్ము మొత్తం పాకిస్తాన్‌లో ఇమ్రాన్‌ఖాన్ కట్టించిన కాన్సర్ ఆసుపత్రికి విరాళంగా అందచేశాడు అమీర్‌ఖాన్.

### పురాతన మురళి

**జ**ర్మనీలోని స్వాబియాన్ పర్వతాల్లో పురాతన వస్తు పరిశోధకశాఖ నిర్వహించిన త్రవ్వకాల్లో ఒక వేణువు **(Flute)** బయట పడింది. అది 35 వేల సంవత్సరాల నాటిదని తేలింది.

*- గాయత్రి*

---



(మిగతా భాగం వచ్చే వారం)